సాక్షి
పశ్చిమగోదావరి
ఆదివారం । 30 । ఏప్రిల్ । 2023



సత్యదేవుని బ్రహ్మోత్సవాలు

లింగపాలెం మండలం రంగాపురంలోని భూనీలాదేవి సమేత సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నుంచి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. 6లో ▸



అంతర్ జిల్లా దొంగల అరెస్ట్

పట్టపగలే తాళాలు వేసి ఉన్న ఇళ్లను దోచేస్తున్న అంతర్ జిల్లా దొంగలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు చెప్పారు. 6లో ▸

108లో ప్రసవం



కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా ముసునూరు మండలం చిల్లబోయినపల్లికి చెందిన ఓ గర్భిణి 108 వాహనంలోనే ప్రసవించింది. 6లో

న్యూస్‌రీల్

12 నుంచి మహా యజ్ఞం



వివరాలు వెల్లడిస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం అర్బన్: విజయవాడలో వచ్చే నెల 12 నుంచి 15 వరకు మహా యజ్ఞం నిర్వహించనున్నట్టు ఉప ముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. తాడేపల్లిగూడెంలో శనివారం ఆయన విలేకరులకు వివరాలు వెల్లడించారు. ఎనిమిది ఆగమాలను సంపుటీకరణ చేసి మహాయజ్ఞాన్ని ప్రారంభిస్తారన్నారు. రాష్ట్రంలోని ఘనాపాటీలందరినీ ఆహ్వానించామని, 1008 మందితో శ్లోకాల పారాయణం, సిద్దేశ్వరి పీఠాధిపతులు శ్రీ రమ్యానందభారతి స్వామి, శ్రీ శక్తి పీఠాధిపతి రమ్యానంద భారతి విచ్చేస్తారన్నారు. తొలి రోజు భూమాతా పారాయణం, అంకురార్పణ, సత్సంగణం చేస్తారని, చాగంటి కోటేశ్వరరావు ప్రవచన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. అముక్తమాల్య శ్రీ గోదారంగనాథ స్వాముల కల్యాణం నృత్య రూపకం, దుర్గామల్లేశ్వరస్వామి వారి కల్యాణం చేస్తారన్నారు. 13న వేంకటేశ్వర చండీ హోమ చతుర్వేద పారాయణం, రామాయణ ఘట్టాల నృత్య రూపక ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి కల్యాణం చేస్తారన్నారు. 14న హనుమాన్ చాలీసా, చతుర్వేద పారాయణంతో పాటు 108 హోమగుండాల్లో పూజాదికాలు చేయనున్నట్టు చెప్పారు. శ్రీ లక్ష్మీ అమ్మవారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, రాఘవేంద్ర ఆలయం 108వ సూర్యేంద్రచంద్ర స్వామితో పూజలు చేస్తారన్నారు. నారాయణీయం బ్రహ్మోత్సవాల వాహన సేవ ఇతివృత్తాన్ని నృత్యరూపకంలో ప్రదర్శిస్తారన్నారు. 15న లక్ష్మీ స్తోత్ర పారాయణాలు, చతుర్వేద పారాయణం, రాష్ట్రం అభివృద్ధి చెందడానికి, సస్యశ్యామలంగా ఉండేందుకు పూజలు చేస్తారని తెలిపారు. లక్ష్మీ అమ్మవారికి త్రిసముద్ర పవిత్ర జలాలతో అభిషేకాలు చేస్తారన్నారు. రాష్ట్ర చరిత్రలో ప్రప్రథమంగా మహా యజ్ఞం నిర్వహిస్తున్నట్టు మంత్రి కొట్టు చెప్పారు.

ఉండి ఏఎంసీ అ'ద్వితీయ'ం



ఏఎంసీ అధికారులను అభినందిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్

ఉండి: ఉండి వ్యవసాయ మార్కెట్ యార్డు (ఏఎంసీ) రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికిగాను నిర్దేశిత మార్కెట్ ఫీజు రూ.9.20 కోట్లు కాగా రూ.10.88 కోట్లు సాధించింది. ఆకివీడు ఏఎంసీ రూ.5 కోట్ల లక్ష్యానికి రూ.5.06 కోట్లు సాధించింది. శుక్రవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయశాఖ కమిషనర్ ఆయా ఏఎంసీల అధికారులను అభినందించారు. శనివారం ఏఎంసీల అధికారులు, సిబ్బంది డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని 216 ఏఎంసీల్లో ఉండి మార్కెట్ యార్డు రెండో స్థానంలో నిలవడం అభినందనీయమని ఆయన అన్నారు. ఏఎంసీల కార్యదర్శులు నలబామావుళ్లు, బొక్కా వెంకటరామకృష్ణ పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలి

తాడేపల్లిగూడెం (టీఓసీ): న్యాయవాదుల రక్షణకు చట్టం చేయాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఉభయ జిల్లాల కార్యదర్శి కామన మునిస్వామి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఐలు జిల్లా కమిటీ సమావేశం శనివారం స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో వి.శైలజ అధ్యక్షతన జరిగింది. ఇటీవల న్యాయవాదుల హత్యలు, వారిపై హత్యలు పెరిగాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయవాదుల సంక్షేమానికి నిధులు కేటాయించాలని కోరారు. జూనియర్ న్యాయవాదులకు ఏడాదికి రూ.10 వేల ఉపకార వేతనాన్ని ఐదేళ్ల పాటు ఇవ్వాలన్నారు.

నూజివీడు.. మామిడి తోడు

మెట్ట ప్రాంత మామిడి రుచి విదేశాల వరకూ వెళ్లింది. పండ్లలో రారాజుగా పిలిచే మామిడికి నూజివీడు డివిజన్ కేరాఫ్ అడ్రస్‌గా నిలిచింది. పంటలో దశాబ్దాలుగా పాటించిన మెళకువలు, ప్రత్యేక రకాల సాగులో సాధించిన నాణ్యమైన దిగుబడులు దేశ, విదేశాల్లో మామిడికి మార్కెట్‌ను సృష్టించాయి. ప్రధానంగా రసాలు రకం నూజివీడు రసాలుగా ఖ్యాతి గడించాయి. ఇదిలా ఉండగా వాతావరణ ప్రతికూలతలో ఈ ఏడాది ఆశించిన దిగుబడులు లేక మార్కెట్ కొంత మేర తగ్గింది.

- రాష్ట్రంలోనే ఖ్యాతిగాంచిన రసాలు
- గతంలో విదేశాలకూ ఎగుమతులు
- ఆరు ప్రధాన రకాల సాగు
- మంగుతో ఈ ఏడాది దెబ్బతిన్న మార్కెట్
- ప్రస్తుతం మూడు రకాలే అందుబాటులో..



మామిడి తోట



తోతాపురి రకం కాయలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లాలోని మెట్ట ప్రాంతాలైన నూజివీడు, చింతలపూడి, లింగపాలెం, జంగారెడ్డిగూడెం, పశ్చిమగోదావరి జిల్లాలోని నరసాపురం, మొగల్తూరు, ద్వారకాతిరుమల, నల్లజర్ల, కృష్ణా జిల్లాలోని మైలవరం, తిరువూరు మండలాల్లో మామిడి సాగు ఉంది. వీటిలో ప్రధానంగా నూజివీడు డివిజన్‌లోని నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు, చింతలపూడిలో మూడు ప్రత్యేక రకాలు అధికంగా సాగు చేశారు. మూడు నెలల పాటు సీజన్ ఉండే మామిడికి ఈ ఏడాది మార్చిలో వచ్చిన అకాల వర్షాలతో నాణ్యతతో కూడిన దిగుబడి తగ్గడం, పండ్లకు మంగు రావడంతో విదేశీ మార్కెట్ తగ్గింది. సాధారణంగా బంగినపల్లి, తోతాపురి (కలెక్టర్), పెద్ద రసాలు, చిన్న రసాలు, జలాలు, సువర్ణరేఖ తదితర రకాలు సాగు చేస్తుంటారు.

1.40 లక్షల ఎకరాల్లో..

ఏలూరు, కృష్ణా జిల్లాలో ఈ ఏడాది సుమారు 1.40 లక్షల ఎకరాల్లో మామిడి సాగు చేసినట్టు అంచనా. మూడేళ్లుగా జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌లో బంగినపల్లి, తోతాపురి, చిన్నరసాలకు డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ఈ ఏడాది 90 శాతానికిపైగా వీటినే సాగు చేశారు. రైతులు పంటను తోటల నుంచి నేరుగా విజయవాడలోని నున్న ప్రధాన మార్కెట్, ఏలూరు, నూజివీడు, ఆగిరిపల్లి మార్కెట్‌లకు తరలించి విక్రయిస్తుంటారు. ప్రస్తుతం జిల్లా నుంచి ఢిల్లీ, జలంధర్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్రతో పాటు ఇతర ఉత్తరాది రాష్ట్రాలకు మామిడి ఎగుమతి అవుతోంది. రెండేళ్ల క్రితం వరకు శ్రీలంక, సింగపూర్, దుబాయి, ఇంగ్లాండ్ దేశాలకు నూజివీడు రసాలు, బంగినపల్లి ఎగుమతులు ఉండేవి. పూర్తి నాణ్యతతో కూడిన పంటకు ఈ ఏడాది కూడా మంచి డిమాండ్ దేశీయ, విదేశీ మార్కెట్‌లలో ఉంది.

అకాల వర్షాలతో..

ఈ ఏడాది సీజన్ ప్రారంభం నుంచి అధికంగా పొగమంచు, ఫిబ్రవరి, మార్చిలో కురిసిన వర్షాలతో మామిడి సాగుకు కొంత ఇబ్బంది కలిగింది. ఎక్కువ శాతం దిగుబడి రాకపోవడం, మంగు బెడదతో మార్కెట్ గణనీయంగా పడిపోయింది.

ఇతర రాష్ట్రాల్లోనూ..

20 ఏళ్ల క్రితం వరకు మామిడి మార్కెట్ దేశంలోనే కృష్ణా, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల్లో ఎక్కువగా ఉండేది. అయితే మామిడిలో పదుల సంఖ్యలో వెరైటీలు రావడం, ఇతర రాష్ట్రాల్లో కూడా సాగుపై ఆసక్తి పెరగడంతో మన పంటకు దేశీయ మార్కెట్‌లో బలమైన పోటీ ఏర్పడింది. గత పదేళ్లుగా తెలంగాణలోని జగిత్యాల, మంచిర్యాల, కరీంనగర్, ఖమ్మం ప్రాంతాల్లోని రాతి నేలల్లో మామిడి సాగు పెరిగింది. అక్కడ కూడా ఇవే రకాలు సాగు చేస్తుండటంతో ఆన్‌లైన్ మార్కెట్‌కు విదేశీ ఎగుమతుల అవకాశాన్ని అక్కడి వ్యాపారులు అందిపుచ్చుకుంటున్నారు. ఈ ఏడాది సీజన్ అనుకూలంగా లేకపోవడంతో కేవలం నాణ్యమైన పంటకు మాత్రమే మంచి డిమాండ్ ఉంది. నూజివీడు బంగినపల్లిని మామిడి రారాజుగా పిలుస్తుంటారు. అధిక తీపి ఉండటం, సగటున వారం రోజుల వరకు కాయ పాడవని గుణంతో దీని డిమాండ్ అలానే కొనసాగుతోంది. ఈ ఏడాది మార్కెట్ విక్రయాలతో పాటు మామిడిని జ్యూస్ ఫ్యాక్టరీలకు కూడా ఎక్కువగా విక్రయిస్తున్నారు.

వర్షాలతో నాణ్యత తగ్గింది



ఈ ఏడాది వర్షాల వల్ల పంట నాణ్యత తగ్గడంతో ధరలు ఆశాజనకంగా లేవు. చిన్న రసాలు, పెద్ద రసాలు, బంగినపల్లి ధరలు బాగా తగ్గాయి. తోతాపురి (కలెక్టర్ కాయ)కి జ్యూస్ ఫ్యాక్టరీల నుంచి డిమాండ్ ఉండటంతో టన్ను రూ.15 వేల నుంచి రూ.17 వేల వరకూ పలుకుతోంది. గత రెండు, మూడేళ్లు మామిడిలో మంచి లాభాలు వచ్చాయి.
– శీలం రాము, మామిడి రైతు, ఎగుమతిదారుడు, నూజివీడు

నోరూరించే రసాలు



చిన్న రసాలు

జిల్లాలో గతంలో బంగినపల్లి, తోతాపురి, చిన్న రసాలు, పెద్దరసాలు, జలాలు, సువర్ణరేఖ, హిమామ్ పసంద్‌తో పాటు మరికొన్ని వెరైటీలు సాగులో ఉండేవి. మార్కెట్ ధరలను ప్రామాణికంగా తీసుకుని చిన్న రసాలు, పెద్ద రసాలు, జలాలు, తోతాపురి సాగును రైతులు అధికంగా చేస్తున్నారు.

- పెద్ద రసాలు మే నెలాఖరు నుంచి ప్రారంభమై జూన్ ఆఖరు వరకు అందుబాటులో ఉంటాయి. రసాల్లో ఎక్కువ తీపి ఉండటం, కాయ పరిమాణం పెద్దదిగా ఉండటంతో వీటికి డిమాండ్ అధికం.
- చిన్న రసాలు మొదట కోతవి పచ్చళ్లు, ఇతర గృహ అవసరాలకు, రెండో కోత నుంచి పండ్లుగా వినియోగిస్తారు. దీని సీజన్ ఏప్రిల్ నుంచి మే నెలాఖరు వరకు ఉంటుంది.
- తోతాపురి (కలెక్టర్ కాయ) ఇది కూడా పచ్చళ్లు, మామిడి తాండ్ర, జ్యూస్, బహిరంగ మార్కెట్ విక్రయాలతో పాటు చివరి రెండు కోతలను పండ్లుగా వినియోగిస్తారు.
- చివరగా జూన్ నుంచి ఆగస్టు వరకు జలాల రకం సీజన్ కొనసాగుతుంది.



పెద్ద రసాలు

ధాన్యం కొనుగోళ్లు వేగిరపర్చాలి

కలెక్టర్ ప్రశాంతి



ఉండిలో ఆర్‌బీకేను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

ఉండి: రైతుల నుంచి ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం ఉండిలో రైతు భరోసా కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ధాన్యం సేకరణ వివరాలపై ఆరా తీశారు. తేమశాతం నిర్ధారించే యంత్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దన్నారు. పూర్తిస్థాయిలో గోనె సంచులు అందించాలని, రైతులు రవాణా ఏర్పాట్లు చేసుకుంటే చార్జీలను వారి ఖాతాల్లో జమచేస్తామన్నారు. సిబ్బంది క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఆర్ఐ ఆర్.కార్తీక్ ఉన్నారు. అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి జెడ్.వెంకటేశ్వరరావు ఉండి–3 రైతు భరోసా కేంద్రాన్ని పరిశీలించారు. ఉండిలోని నాలుగు రైతు భరోసా కేంద్రాల పనితీరుపై ఆరా తీశారు.

1 నుంచి ఫుట్‌బాల్ లీగ్

సాక్షి, భీమవరం: స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పశ్చిమగోదావరి జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌తో కలిసి వచ్చేనెల 1, 2 ,3 తేదీల్లో ఫుట్‌బాల్ లీగ్ నిర్వహించనున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ ఎం.జగపతిరాజు తెలిపారు. శనివారం కళాశాలలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంతవర్మ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోస్టర్ విడుదల చేశారు. కళాశాల పీడీ పి.సత్యనారాయణరాజు, జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమిరెడ్డి హరికృష్ణ మాట్లాడుతూ నూతన పశ్చిమగోదావరి జిల్లా ఏర్పాటైన తర్వాత జిల్లా అసోసియేషన్ నూతనంగా ఏర్పాటైందన్నారు. జిల్లాలో ప్రథమంగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలతో కలిసి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

రైతులను ఇబ్బంది పెడితే ఊరుకోం

మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు



జిల్లా సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రులు కొట్టు సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు చిత్రంలో జెడ్పీ చైర్మన్ కవురు శ్రీనివాస్, కలెక్టర్ ప్రశాంతి, జేసీ రామసుందర్‌రెడ్డి, ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టే రైస్‌మిల్లర్లను బ్లాక్‌లిస్టులో పెట్టాలని ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. కలెక్టరేట్‌లో శనివారం జరిగిన జిల్లా సమీక్షా సమావేశంలో పాలకొల్లు ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు ధాన్యం అమ్ముకోడానికి రైతులు ఇబ్బంది పడుతున్నారంటూ ప్రస్తావించడంతో మంత్రులు తీవ్రంగా స్పందించారు. గతంలో ఎన్నడూలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం పారదర్శకంగా ఆర్‌బీకేల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తూ రైతులకు సొమ్ములు జమ చేస్తోందన్నారు. రైతులు మిల్లర్ల వద్దకు వెళ్లాల్సిన అవసరం లేదని, ఆర్‌బీకేలో అమ్మిన ధాన్యానికి రశీదు తీసుకుంటే బ్యాంకు ఖాతాల్లో సొమ్ములు జమవుతాయన్నారు. కొన్నిచోట్ల మిల్లర్లు ధాన్యం దించుకోవడం లేదని కొందరు టీడీపీ నాయకులు అల్లరి చేయిస్తున్నారని, మిల్లర్లతో రైతులకు పనిలేనప్పుడు మిల్లుల వద్దకు వెళ్లాల్సిన అవసరమేంటని ప్రశ్నించారు. గత ప్రభుత్వం ఐదేళ్లలో 17 లక్షల మంది రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తే సీఎం జగన్ ప్రభుత్వం మూడున్నరేళ్లలో 31 లక్షల మంది నుంచి ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. నాడు దళారీ వ్యవస్థతో రైతులను ఇబ్బంది పెడితే నేడు రైతులే స్వయంగా ధాన్యం అమ్ముకునే పరిస్థితి ఏర్పడిందన్నారు.

ఇళ్లపై మాట్లాడే అర్హత టీడీపీకి లేదు

టిడ్కో ఇళ్ల నిర్మాణాన్ని ఎమ్మెల్యే రామానాయుడు ప్రస్తావించగా మంత్రులు తీవ్రంగా మండిపడ్డారు. టీడీపీ హయాంలో ఒక్కసెంటు భూమిని కొనుగోలు చేసి పేదలకు ఇవ్వని నాయకులకు ఇప్పుడు వాటి గురించి మాట్లాడే అర్హతలేదని ధ్వజమెత్తారు. దేశంలో ఎక్కడాలేని విధంగా సీఎం జగన్ 31 లక్షల మంది పేదలకు కుల, మత, రాజకీయాలకు అతీతంగా ఇళ్లస్థలాల పట్టాలు ఇచ్చారని, 25 లక్షలకు పైగా ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సీఎం జగన్ పేదలకు చేస్తున్న మంచి పనికి 40 ఏళ్ల రాజకీయ చరిత్ర అని చెప్పుకునే చంద్రబాబు తలదించుకోవాలని ఎద్దేవా చేశారు. పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వాన్ని అన్నివర్గాల ప్రజలు ఆదరిస్తున్నారని, దీనిని ప్రతిపక్షాలు తట్టుకోలేకపోతున్నాయని విమర్శించారు. మంత్రి కారుమూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ జిల్లాపరిషత్‌లో నిధులు మంజూరు చేస్తున్నా అధికారుల్లో సమన్వయం లేకపోవడంతో పనులు ముందుకు సాగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాపరిషత్ చైర్మన్ కవురు శ్రీనివాస్, ఎమ్మెల్యేలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు, కలెక్టర్ పి.ప్రశాంతి, ఎస్పీ యు.రవిప్రకాష్, జేసీ పి.రామసుందర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధం

నేడు వరుడు కానున్న చినవెంకన్న



విద్యుద్దీపాలతో కాంతులీనుతున్న ద్వారకాతిరుమల చిన వెంకన్న ఆలయ రాజగోపురాలు



ముస్తాబవుతున్న శ్రీవారి వాహనాలు



ఉత్సవమూర్తులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల వేంకటేశ్వర స్వామి (చినవెంకన్న) వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు ద్వారకాతిరుమల క్షేత్రం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఉత్సవాల నిర్వహణకు దేవస్థానం అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఆదివారం నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు వచ్చేనెల 7వ తేదీతో ముగియనున్నాయి. దీనిలో భాగంగా ఆలయాన్ని, పరిసరాలను విద్యుద్దీప తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయ రాజగోపురాల సముదాయం, అనివెట్టి మండపం తదితర ప్రాంతాలు విద్యుద్దీప కాంతులతో ధగధగలాడుతున్నాయి. ఆలయ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన స్వామివారి భారీ విద్యుత్ కటౌట్ ఆకట్టుకుంటుంది. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు నిర్మించారు. రోజూ ఉదయం, రాత్రి వేళల్లో నిర్వహించే శ్రీవారి తిరువీధి సేవలకు స్వామివారి వాహనాలను ముస్తాబు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ నిమిత్తం ఆలయ తూర్పురాజగోపుర ప్రాంతంలోని శ్రీహరి కళాతోరణం వేదికను సుందరీకరించారు. తొలిరోజు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేయడంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. ఉత్సవాలు ముగిసే వరకు ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రోజుకో ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిస్తారన్నారు.

బ్రహ్మోత్సవాల్లో నేడు :

- ఉదయం 10 గంటల నుంచి శ్రీవారిని పెండ్లికుమారునిగా, అమ్మవార్లను పెండ్లి కుమార్తెలుగా ముస్తాబు చేస్తారు.
- ఉదయం 8 గంటల నుంచి భజన కార్యక్రమాలు
- ఉదయం 10 గంటల నుంచి భక్తిరంజని
- సాయంత్రం 4 గంటల నుంచి నాదస్వరకచేరి
- సాయంత్రం 6 గంటల నుంచి కూచిపూడి భరత నాట్య ప్రదర్శనలు
- రాత్రి 7 గంటల నుంచి గజ వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ
- శ్రీవారి ప్రత్యేక అలంకారం : శ్రీ భూసమేత మహావిష్ణువు

88,638 మందికి 'కంటి వెలుగు'

భీమవరం (ప్రకాశంచౌక్): కంటి వెలుగు స్క్రీనింగ్ పరీక్షలు త్వరితగతిన పూర్తి చేయాలని. జిల్లాలో 60 ఏళ్లు పైబడిన 88,638 మందికి మూడో విడత కంటి వెలుగు కార్యక్రమం కింద స్క్రీనింగ్ పరీక్షలు చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకూ 22,248 మందికి పరీక్షలు నిర్వహించినట్టు కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లో శనివారం కంటి వెలుగు కార్యక్రమంపై వైద్యశాఖ అధికారులతో ఆమె సమీక్షించారు. నరసాపురం, పాలకొల్లు మండలాల్లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించాలని సూచించారు. మూడో విడత పరీక్షలు ఆగస్టులోపు పూర్తిచేయాలని ఆదేశించారు.

క్లుప్తంగా

108 వాహనంలో ప్రసవం



108లో ప్రసవం చేసిన సిబ్బంది

ముసునూరు: కాన్పు కోసం ఆస్పత్రికి తరలిస్తుండగా ఓ గర్భిణి 108 వాహనంలోనే ప్రసవించింది. వివరాలిలా ఉన్నాయి. చిల్లబోయినపల్లి గ్రామానికి చెందిన విజయ (25) గర్భిణి. శనివారం తెల్లవారుజామున పురిటి నొప్పులు వస్తుండడంతో 108 వాహనంలో ఆమెను కాన్పు కోసం ఏలూరు తరలిస్తున్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సమీపంలోకి చేరుకునేసరికి నొప్పులు తీవ్రమవడంతో వాహనాన్ని పక్కనే ఆపి టెక్నీషియన్ ఏలేటి శామ్యూల్, పైలెట్ శివరంగారావు కాన్పు చేశారు. మగ బిడ్డ జన్మించగా, తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో చేర్చారు. విషయం తెలుసుకున్న జిల్లా ఓఈ, డీఎం వెంకటేష్ సిబ్బందిని అభినందించారు.

ఇద్దరు అంతర్ జిల్లా దొంగల అరెస్టు

- రూ.15 లక్షల చోరీ సొత్తు స్వాధీనం, పరారీలో మరో దొంగ
- ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు

ఏలూరు టౌన్ : పట్టపగలే తాళాలు వేసి ఉన్న ఇళ్లను దోచేస్తున్న అంతర్ జిల్లా దొంగలు ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏలూరు ఇన్‌చార్జి డీఎస్పీ జీవీఎస్ పైడేశ్వరరావు చెప్పారు. ఏలూరు త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలను వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన ఆవుల కిరణ్‌కుమార్ అలియాస్ రాహుల్ ఎ.కొండూరు, చైతన్యనగర్ ప్రాంతానికి చెందిన భూక్య నాగరాజు నాయక్‌తో పాలు మరో వ్యక్తితో కలిసి కొంత కాలంగా ఏపీ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడుతున్నారు. వీరిపై ఏలూరు త్రీటౌన్‌లో మూడు కేసులు, ఏలూరు టూటౌన్‌లో రెండు కేసులు, ప్రొద్దుటూరు స్టేషన్‌లో ఒక కేసు ఉన్నాయి. సత్రంపాడులో మేఘన అపార్ట్‌మెంట్‌లో ఈ ఏడాది మార్చి 28న పట్టపగలు చోరీ చేశారు. ఈ చోరీపై కేసు నమోదు చేసిన ఏలూరు త్రీటౌన్ పోలీసులు దొంగలను పట్టుకునేందుకు ఏలూరు సీసీఎస్ పోలీసులతో కలిసి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఏలూరు మినీబైపాస్ గ్రీన్‌సిటీ ప్రాంతంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు వ్యక్తులను త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్, ఎస్‌ఐ ఎస్.శంకర్ అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. ఇద్దరు దొంగల నుంచీ సుమారుగా 25 కాసుల బంగారు ఆభరణాలు, సుమారు 1 కిలో వెండి వస్తువులు, ఒక శాంత్రో కారు, రెండు పాత ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. బంగారు, వెండి వస్తువుల విలువ సుమారు రూ.13 లక్షల వరకూ ఉండగా, కారు, ఫోన్లు విలువ మరో రూ.2 లక్షలు మొత్తం రూ.15 లక్షల వరకూ ఉంటుంది. ఇక మరో నిందితుడ్ని అరెస్టు చేసి అతని నుంచీ సుమారు 4 కాసుల బంగారు ఆభరణాలు, 700 గ్రాముల వెండి వస్తువులు రికవరీ చేయాల్సి ఉందని పోలీసులు చెబుతున్నారు. ఈ కేసును డీఎస్పీ పైడేశ్వరరావు పర్యవేక్షణలో ఛేదించిన త్రీటౌన్ సీఐ కేవీఎస్‌వీ ప్రసాద్, సీసీఎస్ సీఐ సీహెచ్‌వీ మురళీకృష్ణ, ఎస్‌ఐ ఎస్.శంకర్, ఎస్‌ఐ నాగేశ్వరరావు, సిబ్బందిని ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి అభినందించారు.

నేటి నుంచి సత్యదేవుని బ్రహ్మోత్సవాలు



భూదేవి నీలాదేవి సమేత సత్యన్నారాయణస్వామివారు



ముస్తాబైన శ్రీసత్యన్నారాయణస్వామి ఆలయం

లింగపాలెం : రాష్ట్రంలోనే రెండో అన్నవరంగా ప్రసిద్ధిచెందిన రంగాపురంలో వేంచేసిన శ్రీభూనీలాదేవి సమేత సత్యన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఆదివారం నుంచి వైభవంగా ప్రారంభం కానున్నాయి. ఈ ఉత్సవాలకు ఉభయగోదావరి జిల్లాల నుంచే కాక కృష్ణా, ఖమ్మం, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో రానున్నారు. దీంతో ఆలయ అధికారులు పూర్తిస్థాయిలో భక్తులకు ఏర్పాట్లుచేస్తున్నారు. మే 7వ తేదీ వరకు కొనసాగే ఈ బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలిరోజు ఆదివారం ఉదయం 9 గంటలకు స్వామివారిని పెండ్లి కుమారుడుగా, అమ్మవారిని పెండ్లి కుమార్తెగాను చేస్తారు. మే 2వ తేదీ ఉదయం 11 గంటలకు సంతానం లేని దంపతులకు గరుడ ప్రసాదం అందిస్తారు. 4వ తేదీ రాత్రి 9 గంటలకు స్వామివారి కల్యాణం, 5న గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

మహిళను వేధిస్తున్న వ్యక్తిపై కేసు

కాళ్ల: మహిళను వేధిస్తున్న ఓ వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు కాళ్ల పోలీసులు శనివారం తెలిపారు. కాళ్లకు చెందిన ఓ మహిళను నల్ల గంజి సురేష్ అనే వ్యక్తి మూడేళ్ల నుంచి ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకోమని, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటానని వేధిస్తున్నాడు. కొంతకాలం తరువాత కోలనపల్లి రోడ్డు మహిళను చాకుతో చంపుతానని బెదిరించాడు. ఈ నెల 26న రాత్రి మహిళ గ్రామంలో అమ్మవారి దర్శనానికి భర్తతో కలిసివెళుతుండగా, సురేష్ వెనక నుంచి మహిళ చీరచెంగులాగి బూతులు తిట్టి అవమానించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు ఎస్సై ఏజీఎస్ మూర్తి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చెరువుల కేటాయింపు ఆదేశాలు అమలు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని గ్రామాల్లో రజక వృత్తిదారులకు గ్రామ పంచాయితీలు చెరువులు కేటాయిస్తూ చేసిన తీర్మానాల అమలుకు కలెక్టర్ పంచాయతీ వింగ్ ద్వారా ఆదేశాలను జారీ చేయాలని ఏపీ రజక జన సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి జిల్లా అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య కోరారు. ఏలూరులో శనివారం నిర్వహించిన సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రజక వృత్తిదారులకు చెరువులు కేటాయించాలని ప్రభుత్వం జారీ చేసిన ఆదేశాలు నేరుగా సంబంధిత సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు చేరకపోవడంతో రజక వృత్తిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామాలలో రజకులకు చెరువులు కేటాయించినప్పటికీ రకరకాల కుంటి సాకులతో కొన్ని గ్రామాలలో పంచాయతీ అధికారులు ఇబ్బందులు పెడుతున్నారని గుర్తు చేశారు. ధర్మాజీగూడెంలో రజకుల చెరువుకు లీజు రూ.20 వేలు కట్టించుకుని రశీదు ఇవ్వలేదని ఆరోపించారు. రాష్ట్రంలోని రజకులకు వైఎస్ జగన్ ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నప్పటికీ జీఓల అమలులో అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా రజకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా రజక యూత్ ప్రధాన కార్యదర్శి విశాల శ్రీనివాస్, నాయకులు వట్లూరి మురళీ, గుల్లపూడి వెంకటేశ్వరరావు, ధర్మాజీగూడెం నాయకులు నున్నా సబ్బయ్య హుకుంపేట నాగేశ్వరరావు, లక్ష్మీప్రసన్న, వీర్రాజు, దుర్గారావు, మహంకాళి పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి



ఏలూరు టౌన్: ఏలూరు మార్కెట్ యార్డ్ సమీపంలో రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. మృతుడి వయస్సు 25 ఏళ్లు ఉండవచ్చని, 5.5 అడుగుల ఎత్తు, చామనచాయ రంగు కలిగి ఉన్నాడు. కుంకుమరంగు పొట్టి చేతుల టీషర్ట్, నలుపు రంగు జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. మృతుని కుడిచేతిపై ఏఎస్ అనే పచ్చబొట్టు ఉంది. ఏలూరు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రి మార్చురీలో ఉంచారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు 80740 55378 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

కలప పట్టివేత



బుట్టాయగూడెం: రెడ్డిగణపవరం పరిసర అటవీ ప్రాంతంలో నరికిన కలపను అక్రమంగా రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఫారెస్ట్ స్క్వాడ్ అధికారులు పట్టుకున్నారు. అక్రమ కలప రవాణా జరుగుతున్నట్లు అందిన సమాచారం మేరకు నిఘా పెట్టిన అధికారులు రెడ్డిగణపవరం సమీపంలో ట్రాక్టర్‌ను పట్టుకుని సీజ్ చేశారు. సంబంధిత అధికారులకు ట్రాక్టర్‌ను అప్పగించారు. అయితే ట్రాక్టర్‌ను అటవీశాఖ కార్యాలయానికి కాకుండా రెడ్డిగణపవరంలోని ఒక రైతుకు సంబంధించిన ప్రదేశంలో ఉంచారు. ట్రాక్టర్‌ను ఫారెస్ట్ కార్యాలయానికి కాకుండా గ్రామంలోనే ఉంచడం పలు అనుమానాలకు తావిస్తోంది. అయితే గత నాలుగు నెలలుగా ఫారెస్ట్ శాఖ వారే కలప అక్రమ రవాణా జరుగుతుంటే చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్క్వాడ్ అధికారులకు వచ్చిన సమాచారం మేరకు ఈ ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పలువురు చెబుతున్నారు.

పోటాపోటీగా నాటిక ప్రదర్శనలు



కొంతేరులో స్వర్ణ కమలాలు నాటికలోని దృశ్యం

యలమంచిలి : కొంతేరులోని శ్రీ పులపర్తి వీరాస్వామి యూత్ క్లబ్ కళామందిర్ ఆధ్వర్యంలో ప్రదర్శితమవుతున్న నాటిక పోటీలు ఆహుతులను ఆద్యంతం ఆకట్టుకుంటున్నాయి. సమాజంలో పెరుగుతున్న అసమానతలను ఎత్తి చూపుతూ రెండోరోజు శనివారం మూడు నాటికలు ప్రదర్శించారు.

స్వర్ణ కమలాలు

భార్య పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలో శ్రీ హర్ష క్రియేషన్ విజయవాడ వారిచే ప్రదర్శించిన స్వర్ణ కమలాలు నాటిక చాటి చెప్పింది. అనుకోకుండా ఎదురైన అందమైన కమలను నవలా రచయిత శ్రీహర్ష పెళ్లి చేసుకుంటాడు. ఆమెకు చదువు చెప్పడమే కాక రచయితను చేస్తాడు. ఆమె రాసిన నవల జాతీయ పురస్కారానికి ఎంపికవడంతో అసూయతో భార్యపై చేయి చేసుకుంటాడు. తరువాత తన తప్పు తెలుసుకుని ఆమె కాళ్లపై పడతాడు. ఈ నాటికను మునిపల్లి విద్యాధర్ రచించగా కత్తి శ్యాం ప్రసాద్ దర్శకత్వం వహించారు.

నాన్నా..నేనొచ్చేస్తా..

చిన్నతనం నుంచి జీవిత సత్యాలు వివరిస్తూ పిల్లలను పెంచితే పెళ్లి అయ్యాక నాన్నా..నేనొచ్చేస్తా అని కాకుండా నాన్న మీరు మా ఇంటికి ఎప్పుడు వస్తారని పిలిచే రోజులు రావాలనే ఇతివృత్తంతో శ్రీ అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ గుంటూరు వారిచే ప్రదర్శించిన నాటిక వివరించింది. ఈ నాటికను తాళాబత్తుల వెంకటేశ్వరరావు రచించగా అమృత లహరి దర్శకత్వం వహించారు.

రైతే రాజు

రోజురోజుకీ వ్యవసాయం దండగ అనే స్థితిని రైతులకు కల్పిస్తున్నారు. అదే జరిగితే తినడానికి గింజలు లేక ప్రజలు ఎలా అల్లాడతారో వివరిస్తూ కళాంజలి హైదరాబాద్ వారు ప్రదర్శించిన రైతే రాజు నాటిక నిరూపించింది. ఈ నాటికను కంచర్ల సూర్యప్రకాశరావు రచించగా కొల్లా రాధాకృష్ణ దర్శకత్వం వహించారు.

భీమవరంలో సందేశాత్మకంగా..

సాక్షి, భీమవరం: పట్టణంలోని చైతన్య భారతి సంగీత, నృత్య, నాటక పరిషత్ 16వ జాతీయ స్థాయి సాంఘిక నాటిక పోటీలు మూడోరోజు రసవత్తరంగా సాగాయి. డీఎన్నార్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కళావేదికపై శనివారం రాత్రి పోటీలను కారుమూరి సత్యనారాయణమూర్తి, సాగి విఠల్ గంగరాజు, ఆలపాటి తులసీ వెంకటరమణ ప్రారంభించారు. నాటకాలను పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు రాయప్రోలు భగవాన్, మంతెన రామ్‌కుమార్‌రాజు, రాయప్రోలు శ్రీనివాసమూర్తి, బొండాడ రామకృష్ణారావు, భట్టిప్రోలు శ్రీనివాసరావు, పేరిచర్ల లక్ష్మణవర్మ పర్యవేక్షించారు. శ్రీ మణికంఠ ఆర్ట్స్ పిఠాపురం వారి ×కొత్తతరం కొడుకులు× నాటిక వృద్ధాప్యంలో తల్లిదండ్రుల బాధ్యతను పిల్లలు వహించాలనే సందేశానిచ్చింది. మూలకథ ఆర్.కృష్ణారావు, దర్శకత్వం చెలికాని వెంకట్రావు వహించారు. మానవత్వపు పరిమళంతో సరిహద్దులు లేని అందమైన ప్రపంచాన్ని భావి తరాలకు అందించాలనే సందేశమిస్తూ శార్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం శ్రీకాకుళం వారి ×కొత్త పరిమళం× నాటిక సాగింది. ఈ నాటికకు కథ కాండ్రేగుల శ్రీనివాసరావు, దర్శకత్వం బీఎంఎస్ పట్నాయక్ వహించారు. కూతురి కాపురం నిలబెట్టేందుకు ఒక తండ్రి చేసిన పరిష్కారాలు, అమ్మాయిలు ఇబ్బందులు, కష్టాలపై ఒక తండ్రి చేసిన పరిష్కారాల గురించి విశదీకరిస్తూ సాగింది శ్రీసాయిఆర్ట్స్ కొలకలూరి వారి ×ప్రేమతో నాన్న× నాటిక. ఈ నాటికకు రచన రావి నాగేశ్వరరావు, దర్శకత్వం గోపరాజు విజయ్ వహించారు.

జేఈఈ మెయిన్స్‌లో శ్రీషిర్డిసాయి ఆధిక్యత



విజయం సాధించిన విద్యార్థులతో కళాశాల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్‌లో శ్రీ షిర్డి సాయి జూనియర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్టు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య శనివారం చెప్పారు. తమ ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందిన బీజేఎల్ సాయికిరణ్ 73, పి.భరత్‌నంద 152, జి.అంజనీసుత ఆదిత్య 156, జయప్రకాష్ 269, సీహెచ్ మాన్విత 285 ర్యాంకులు సాధించారని వివరించారు. 300 లోపు ఐదుగురు, వెయ్యి లోపు 11 మంది, 5 వేల లోపు 34 మంది, 10 వేల లోపు 53 మంది, 20 వేల లోపు 78 మంది ర్యాంకులు కైవసం చేసుకున్నారన్నారు. మొత్తం 207 మంది హాజరు కాగా 171 మంది అడ్వాన్స్‌కు అర్హత సాధించారన్నారు. మొత్తం 135 మంది ఎన్ఐటీ, ఐఐటీల్లో సీట్లు సాధించగలరని విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ ఆశాభావం వ్యక్తం చేశారు. విద్యార్థులను, అధ్యాపక బృందాన్ని శ్రీధర్, శ్రీవిద్య, లక్ష్య అకాడమీ డీన్ చంద్రశేఖర్ అభినందించారు.

ఉరి వేసుకుని షిఫ్ట్ ఆపరేటర్ ఆత్మహత్య

మాకవరపాలెం: వెంకన్నపాలెంలో శనివారం షిఫ్ట్ ఆపరేటర్ వడ్లపూడి వెంకటసురేష్ (46) ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదనపు ఎస్ఐ సన్యాసిరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలం తిరుమలంపాలెంకు చెందిన సురేష్ వెంకన్నపాలెంలో అద్దె ఇంట్లో ఉంటూ కశింకోట మండలం కన్నూరుపాలెం వద్ద ఓ కంపెనీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం కంపెనీకి రాకపోవడంతో తోటి పనివారు ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో కంపెనీ సెక్యూరిటీ గార్డు వచ్చి ఇంటి కిటికీలో నుంచి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకుని అతడి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

నవోదయ ప్రవేశ పరీక్షకు 4,738 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలోని జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2023–24 విద్యా సంవత్సరంలో 6వ తరగతిలో ప్రవేశాల కోసం శనివారం నిర్వహించిన పరీక్షకు 4,738 మంది హాజరయ్యారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఈ పరీక్ష కోసం 22 కేంద్రాలను ఏర్పాటు చేసి, ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు పరీక్ష నిర్వహించినట్లు డీఈఓ. ఎస్‌వీ రవిసాగర్ చెప్పారు. పరీక్షకు మొత్తం 5,447 మంది హాజరు కావాల్సి ఉండగా 709 మంది గైర్హాజరయ్యారన్నారు. ఏలూరు డీఈఓ రెండు పరీక్ష కేంద్రాలను, పశ్చిమగోదావరి జిల్లా విద్యాశాఖాధికారి ఒక కేంద్రాన్ని, పెదవేగి నవోదయ విద్యాలయ ప్రిన్స్‌పాల్ రెండు పరీక్ష కేంద్రాలను, ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ ఒక కేంద్రాన్ని సందర్శించారని పేర్కొన్నారు.

క్లుప్తంగా

జేవీకే కమిటీలు బాధ్యతగా పనిచేయాలి



పడాల గ్రామంలోని జేవీకే స్టాక్ పాయింట్‌ను పరిశీలిస్తున్న శ్యామ్‌సుందర్

తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న విద్యాకానుక కిట్ల కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని జిల్లా సమగ్ర శిక్ష కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ అన్నారు. శనివారం మండలంలోని పడాల జగనన్న విద్యాకానుక కిట్ల నాలుగు స్టాక్ పాయింట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శ్యామ్‌సుందర్ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ పూర్తి చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఆయన వెంట ఏఎంవో శ్రీమన్నారాయణ, సీఎంవో రామకోటేశ్వరరావు, సీఆర్‌పీ బత్తుల నానిబాబు ఉన్నారు.

వరాల వెంకన్నకు విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున సుప్రభాతసేవ, తోమాలసేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. పరిసర ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఏడువారాల వ్రతాన్ని ఆచరించారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

చికిత్స పొందుతూ మాజీ వీఆర్వో మృతి



సూరంపూడి కృష్ణభగవాన్(ఫైల్)

అత్తిలి: కంచుమర్రు మాజీ వీఆర్వో సూరంపూడి కృష్ణభగవాన్(78) మృతి చెందారు. బ్రెయిన్ స్ట్రోక్‌రావడంతో హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతూ తుది శ్వాస విడిచారు. ఆయనకు భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కృష్ణభగవాన్ కంచుమర్రు, రేలంగి గ్రామాల కరణంగాను, కంచుమర్రు వీఆర్వోగా పనిచేశారు. పూర్వపు గ్రామాధికారుల సంఘం కొవ్వూరు డివిజన్ కార్యదర్శిగా, జిల్లా ఉపాధ్యక్షునిగా, పదవులు చేశారు. దస్తావేజు లేఖరుల సంఘం మండల, జిల్లా శాఖలకు పలు హోదాల్లో సేవలు అందించారు. సర్పంచ్ పెన్మెత్స కృష్ణంరాజు, ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తపు శ్రీనివాస్, వివిధ పార్టీల నాయకులు కృష్ణభగవాన్ పార్థీవ దేహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు.

తురగ ఉమామణికి డాక్టరేట్



తురగ ఉమామణి

తణుకు అర్బన్: తణుకుకు చెందిన తురగ ఉమామణి ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. తాడేపల్లిగూడెం శ్రీవాసవి జీఎంఆర్, డీఈడీ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉమామణి వెల్‌బీయింగ్, కాగ్నిటివ్ స్టైల్స్ అండ్ అకాడమిక్ రెసిలియన్స్ ఆఫ్ అడాలసెంట్ స్టూడెంట్స్ అనే అంశంపై చేసిన పరిశోధనలో భాగంగా ఈ డాక్టరేట్ పొందినట్లు ఆమె చెప్పారు. ప్రొఫెసర్ టి.స్వరూపారాణి పర్యవేక్షణలో ఈ పరిశోధన చేయగలిగినట్లు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ గ్రంధి సత్యనారాయణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, కోశాధికారి సన్నిధి సూర్యనారాయణ, అధ్యాపకులు, కుటుంబసభ్యులు ఫణికుమార్ తదితరులు అభినందించారు.

ప్రతి ఒక్కరూ బీమా పాలసీలు చేయించుకోవాలి



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో మాట్లాడుతున్న బ్యాంకు అధికారులు

అత్తిలి: బ్యాంకులు అందించే బీమా పాలసీలు పొందాలని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో శనివారం భారత ప్రభుత్వం ఆర్థిక మంత్రిత్వశాఖ, ఆర్థికసేవల విభాగాల ఆదేశానుసారం రాష్ట్రస్థాయి బోర్డు కమిటీ సహకారంతో గ్రామస్థాయి జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ప్రధాన మంత్రి జీవన్‌జ్యోతిబీమా యోజన, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకాల ప్రాముఖ్యతను బ్యాంకు అధికారులు వివరించారు. ఈసందర్భంగా 100 బీమా పాలసీలు ఎన్‌రోల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, వివిధ బ్యాంకుల అధికారులు, పంచాయతీ సెక్రటరీ సుజాత, సీసీలు, డ్వాక్రా గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

వాతావరణ మార్పులతో రైతు గుండెల్లో గుబులు

- ఉరుకులు పరుగులు పెట్టిన రైతులు
- బరకాలతో ధాన్యాన్ని కప్పిన కల్లాల్లోకి నీరు
- నీటిని బయటకు పంపే పనిలో నిమగ్నమైన రైతులు
- దండగర్రలో పడిన పిడుగు – గడ్డిమేటు దగ్ధం



పడాల మార్కెట్ యార్డులో వర్షపు నీటికి తడిసిన ధాన్యం



ఆరుగొలనులో ధాన్యాన్ని బస్తాలుగా కడుతున్న రైతులు



ఎల్.అగ్రహారంలో తడిసిన మొక్కజొన్న కండెలు

తాడేపల్లిగూడెం రూరల్: దాళ్వా రైతులను వరుణుడు పరీక్షిస్తున్నాడు. ఈ సీజన్‌లో పంట దిగుబడులు ఇబ్బడిముబ్బడిగా రావడంతో కోటి ఆశలతో ఉన్న రైతులను వరుణుడు ఉరుకులు పరుగులు పెట్టిస్తున్నాడు. కోతలు ప్రారంభమైన అనంతరం శనివారం రెండోసారి వర్షం కురిసింది. వాతావరణ మార్పులను ముందుగానే గుర్తించిన రైతులు పట్టింపాలెం, రామన్నగూడెం, పడాల, దండగర్ర, ఎల్.అగ్రహారం, ఆరుగొలను, కొత్తూరు, నవాబుపాలెం, జగన్నాథపురం, మోదుగ గుంట, లింగారాయుడిగూడెం తదితర గ్రామాల్లో ధాన్యం రాశులపై ముందుగానే బరకాలు కప్పి రక్షించుకున్నారు. రామన్నగూడెం, పట్టింపాలెం గ్రామాల్లో బరకాలతో కప్పిన ధాన్యం కల్లాల్లో నీరు చేరడంతో వాటిని బయటకు పంపేందుకు రైతులు గాడులు తవ్వడం కనిపించింది. సిరులు పండాయని రైతు సంబరపడుతున్న తరుణంలో వాతావరణ మార్పులు రైతులను అయోమయానికి గురి చేస్తున్నాయి. చాలా వరకు రైతులు బరకాలతో ధాన్యాన్ని కప్పి ఉంచడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఎల్.అగ్రహారం, పట్టింపాలెం గ్రామాల్లో మొక్కజొన్న కండెలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

రానున్న ఐదు రోజులు అప్రమత్తంగా ఉండాలి

రానున్న ఐదు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. ఇంకా కోతలు ప్రారంభించని కోతలు కోయవద్దు, ఇప్పటికే ధాన్యం కోసిన రైతులు ధాన్యాన్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి.

– ఆర్ఎస్.ప్రసాద్, మండల వ్యవసాయాధికారి, తాడేపల్లిగూడెం

కల్లాల్లో 45వేల టన్నుల ధాన్యం :
తాడేపల్లిగూడెం మండలం మొత్తం మీద 1.03లక్షల టన్నుల ధాన్యం దిగుబడులు వస్తాయని అధికారులు అంచనా వేశారు. ఇప్పటి వరకు 30వేల టన్నులు ధాన్యం ప్రైవేట్ వ్యాపారులకు రైతులు విక్రయించారు. మరో 25వేల టన్నులు రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేశారు. మిగిలిన 45 వేల టన్నులు కల్లాలు, బస్తాల్లో రైతుల వద్ద ఉన్నాయి.

జగనన్నకు మెండుగా ప్రజాదరణ



వార్డు ఇన్‌చార్జ్‌ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్

తాడేపల్లిగూడెం అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాదరణ మెండుగా ఉందని భవిష్యత్తు ఎన్నికల్లో జగనే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలుస్తారని ప్రజలే చెప్పడం ఆనందంగా ఉందని వైఎస్సార్‌సీపీ యువనేత కొట్టు విశాల్ పేర్కొన్నారు. ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ క్యాంపు కార్యాలయంలో శనివారం తాడేపల్లిగూడెం పట్టణ వార్డులు, మండలాల పార్టీ ఇన్‌చార్జిలతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విశాల్ మాట్లాడుతూ 'జగనన్నే మా భవిష్యత్' కార్యక్రమంలో ప్రతి ఇంటికి వెళ్లిన సమయంలో ప్రతి ఒక్కరూ జగన్‌మోహన్‌రెడ్డికే మద్దతు పలికారన్నారు. గోడకు స్టిక్కర్లు అతికిస్తుంటే ఇంటి గోడలకు అతికించాలని ప్రజలే కోరారన్నారు. అదే విధంగా పార్టీ ఏర్పాటు చేసి నాలుగు ప్రశ్నల పస్తకాలను ప్రజల అభీష్టంతోనే పూర్తి చేయాల్సి ఉందన్నారు. పార్టీ ఆదేశాలను ప్రతి కార్యకర్త, ఇన్‌ఛార్జిలు తూ.చ తప్పకుండా అనుసరించాలన్నారు. తెదేపా నాయకులు ఇది జీర్ణించుకోలేక పక్క రాష్ట్రాల నుంచి సినిమా తారలను తెచ్చుకొనే దుస్థితికి దిగజారారన్నారు. ఈ కార్యక్రమంలో జట్పీటీసీ సభ్యుడు ముత్యాల ఆంజనేయులు, ముప్పిడి సంపత్‌కుమార్, కర్రి భాస్కరరావు, కొలుకులూరి ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

కర్మాగారాల్లో ఎస్‌ఈబీ, ఎక్సైజ్ అధికారుల తనిఖీలు



తణుకులో కర్మాగారాల్లో తనిఖీలు చేస్తున్న ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖల అధికారులు

తణుకు: తణుకు పరిసర ప్రాంతాల్లోని పలు కర్మాగారాల్లో ఎస్‌ఈబీ, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు శనివారం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఆంధ్రాసుగర్స్, వాన్‌బరీ, ప్లూటస్ కర్మాగారాల్లో ఆర్ఎస్, మిథనాల్ యూనిట్లు తనిఖీ చేసిన అధికారులు సంస్థ యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. రికార్డులను పరిశీలించి నిల్వలను తనిఖీలు చేశారు. ఎలాంటి ప్రమాదాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకోవాలని ముఖ్యంగా ఆర్ఎస్, మిథనాల్ విషయంలో అజాగ్రత్త వల్ల కలిగే దుష్ప్రభావాలను తెలియజేసి ట్యాంకర్లు దిగుమతి, ఎగుమతి సమయాల్లో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ తనిఖీల్లో ఎస్‌ఈబీ జాయింట్ డైరెక్టర్ ఏటీవీ రవికుమార్, ఎస్‌ఈబీ అసిస్టెంట్ సూపరింటెండెంట్ సి.భార్గవ, డిస్టిలరీ అధికారి సీహెచ్ లక్ష్మితులసి, ఎస్సై టి.వెంకటేశ్వరరావు, ఎ.సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం

తాడేపల్లిగూడెం (టీఓసీ): సీఐటీయూ ఆధ్వర్యంలో పపంచ కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు అన్నారు. పట్టణ ముఖ్య కార్యకర్తల సమావేశం శనివారం సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ మే డే రోజున కార్మికుల పనిప్రాంతాలలోను, నివాస ప్రాంతాలలో ఎర్ర జెండాలు ఎగరవేయాలని సూచించారు. టూ టౌన్‌లోని ఎన్‌కే గ్రౌండ్ నందు బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమా మహేశ్వరరావు, ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ప్రసంగాలు ఉంటాయని తెలిపారు. సభ అనంతరం పట్టణంలో కార్మిక, ఉద్యోగులతో భారీ ర్యాలీ ఉంటుందని వివరించారు. కరెడ్ల రామకృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మన్ కీ బాత్ లైవ్‌లో పాల్గొనండి



మన్ కీ బాత్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్న ఈతకోట తాతాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రధాని నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో ఈ నెల 30వ తేదీ ఆదివారం ఉదయం 11 గంటలకు హిందీలో 11.30 గంటలకు తెలుగులో దూరదర్శన్ యాదగిరి ఛానెల్‌లో వచ్చే ప్రధాని నరేంద్ర మోడీ 100వ ఎపిసోడ్ లైవ్‌లో పాల్గొనాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఈతకోట తాతాజీ పేర్కొన్నారు. పట్టణంలో శనివారం అసెంబ్లీ ఇంచార్జి తాతాజీ కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మన్ కీ బాత్ కార్యక్రమంలో కుటుంబ సభ్యులతో, స్నేహితులతో, గ్రామస్తులతో పాల్గొనాలని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ నరిశే సోమేశ్వరరావు, బీజేపీ రాష్ట్ర నాయకులు కోట రాంబాబు, రామగాని సత్యనారాయణ, దొంతకుర్తి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

150 మందికి వైద్య పరీక్షలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ఆర్తయనా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో గుడ్ సమరిటన్ క్యాన్సర్ అండ్ జనరల్ ఆసుపత్రి వారి సహకారంతో ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శనివారం ఈ శిబిరంలో 150 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించినట్లు వైద్యులు ఎం.చంద్ర, అక్బర్‌లు తెలిపారు. పరీక్షలు అనంతరం అవసరమైన వారికి మందులు ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఆర్.శ్రీనివాసరావు, రామకిరణ్, సతీష్‌కుమార్, నాగబాబు, విజయ్, రామకృష్ణ, వంశీ, శ్రీనివాసరావు, నవీన్, స్టీఫెన్, షణ్ముఖ తదితరులు పర్యవేక్షించారు.

నేడు శ్రీ శ్రీ కవితల పోటీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): సాహితీ వైతాళికుడు, మహాకవి శ్రీరంగం శ్రీనివాసరావు (శ్రీ శ్రీ) జయంతి సందర్భంగా ఈ నెల 30వ తేదీ ఆదివారం సాయంత్రం 6 గంటలకు పట్టణంలోని బీవీఆర్ కళా కేంద్రంలో తెలుగు సాహితీ సమాఖ్య ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ కవితలు, రచనలపై కవితల పోటీ నిర్వహిస్తున్నట్లు సమాఖ్య అధ్యక్షుడు కోపల్లె శ్రీనివాస్ వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే విజేతలకు బహుమతులు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీ శ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ హాజరవుతారని తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మహిళా కళాకారులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కళాకారుల సంక్షేమానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం సంఘ 131వ నెలవారీ సర్వసభ్య సమావేశం మాసా బాబూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కలలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం పలువుర్ని సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కొలుకులూరి ధర్మరాజు, బొద్దాని శ్రీనివాస్, కళాకారులు కవురు శారద, డాక్టర్ జే.మాలతీమాధవ్, చింతకాయల వంశీకృష్ణ, తగరంపూడి మురళీకృష్ణ, యడవల్లి శివ కుమార్, యరుబండి సతీష్, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మున్సిపల్ స్కూల్లో గ్రాడ్యుయేషన్ డే

సాక్షి, భీమవరం: చిన్ననాటి నుంచే విద్యార్థులు క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సారిక దుర్గాదేవి అన్నారు. 27వ వార్డులోని రెస్ట్ హౌస్ రోడ్డులోని ఆర్‌హెచ్‌ఆర్ న్యూ మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో శనివారం విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వం ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు విద్యా సౌకర్యాలు, మంచి విద్య అందిస్తుందన్నారు. ప్రభుత్వం కలిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

ఆర్‌బీకేల వద్దే ధాన్యం కొనుగోళ్లు

వీరవాసరం: రైతుల వద్ద ఉన్న ధాన్యాలను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయడానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని వీరవాసరం తహసీల్దార్ ఎం సుందర్ రాజు తెలిపారు. రాయకుదురు ధాన్యం కొనుగోలు కేంద్రం, ఆర్‌బీకేను శనివారం ఆయన సందర్శించారు. రైతులు దళారిని ఆశ్రయించవద్దని, దళారీలు ఉంటే చీటింగ్ కేసు పెట్టి అరెస్ట్ చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈఓ రవి, వీఆర్వో వెంకట్రావు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై సిబ్బందికి అవగాహన

పెంటపాడు: మండలంలోని చెత్త సంపద కేంద్రాన్ని జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జీవీకే మల్లికార్జునరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పెంటపాడు పంచాయతీ సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు మరింత వేగిరపర్చాలి

ఉండి: జగనన్న లేఅవుట్స్‌లో గృహ నిర్మాణాలను మరింత వేగంవంతం చేస్తున్నట్లు ఆర్డీఓ దాసి రాజు అన్నారు. శనివారం ఉండి మండలం వెలివర్రు సమీపంలోని ఎన్నార్పీ అగ్రహారం లేఅవుట్ పూడిక పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం డివిజన్‌లోని అన్ని లేఅవుట్‌ల పూడిక పనులు పూర్తయినట్లేనని తెలిపారు. ఉండి మండలంలోని లేఅవుట్లల్లో ఉండి జడ్పీ హైస్కూల్, చెరుకువాడ, ఎన్నార్పీ అగ్రహారం తదితర ప్రాంతాల్లోని లేఅవుట్‌ల్లో శరవేగంగా ఇళ్ల నిర్మాణం చేపడతామన్నారు. ఇళ్లు కట్టుకోలేని లబ్ధిదారులు అంగీకరించి కట్టమని కోరితే వారికి సుమారు రెండు నెలలలోపుగానే ఇల్లు కట్టి వారికి ఇచ్చేందుకు ఏజెన్సీలు సిద్ధంగా ఉన్నాయన్నారు. ప్రస్తుతం జరుగుతున్న పూడికలు పూర్తికాగానే అద్భుతంగా ఇళ్ల నిర్మాణం కూడా పూర్తి చేస్తామన్నారు. డివిజన్‌లో వీరవాసరం, అత్తిలి మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో పూడిక పనులు పూర్తి కావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో హైసింగ్ అధికారులు పీ శివరామరాజు, ఏఈఈ డీ రామకృష్ణంరాజు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్‌వీఎస్ నాయుడు, ఆర్ఐ ఆర్ కార్తీక్ పాల్గొన్నారు.

చంద్రబాబు కోవర్టుగా రజనీకాంత్



సమావేశంలో మాట్లాడుతున్న మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): చంద్రబాబుకు కోవర్టుగా రాజనీకాంత్ వ్యవహరిస్తున్నారని, ప్రజలు నమ్మకాన్ని చంద్రబాబు, రజనీకాంత్ కోల్పోయారని మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని కడకట్లలో మాలమహానాడు సమావేశం నిర్వహించారు. మంగరాజు మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావును పదవీచ్యుతుడు చేసే క్రమంలో ప్రస్తుత టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రామారావుకు వెన్నుపోటు పొడిచారన్నారు. ఆ సమయంలో హీరో రజనీకాంత్ చంద్రబాబుకు మద్దతుగా వచ్చారని ఈ విషయాన్ని ప్రజలు గమనించారన్నారు. నేడు ఎన్‌టీఆర్ శతయంతి ఉత్సవాల్లో హీరో రజనీకాంత్ పాల్గొని ఎన్‌టీఆర్ కారణ జన్ముడు అని పొగడటం చూస్తే చంద్రబాబుకు కోవర్టుగా రజనీకాంత్‌ను చెప్పవచ్చునని వెల్లడించారు. సినీ హీరోగా రజనీకాంత్ అంటే ఏపీ ప్రజలకు గౌవరం ఉందని, నేడు చంద్రబాబుకు మద్దతుగా మాట్లాడటం కారణంగా రజనీకాంత్‌కు ఏపీ ప్రజల్లో ఆయనకు ఉన్న గౌవరం పోయిందన్నారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా, కుతంత్రాలు చేసినా ఎంత మంది సినిమా హీరోలను తీసుకొని వచ్చినా మరలా 2024లో జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడం ఖాయం అన్నారు. ఈ సమావేశంలో డి.అనిల్, బి.శ్రీనివాస్, బి.సందీప్, బి.సునీల్‌బాబు, సీహెచ్ గోపి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో సత్వర వైద్య సేవలు



అత్తిలి పీహెచ్‌లో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంపీపీ మక్కా సూర్యనారాయణ

అత్తిలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువచ్చి, రోగులకు సత్వర వైద్యసేవలు అందిస్తున్నారని ఎంపీపీ మక్కా సూర్యనారాయణ అన్నారు. అత్తిలి, మంచిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల అభివృద్ధి కమిటీ సమీక్షా సమావేశం శనివారం ఆయన అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా ఎంపీపీ మక్కా సూర్యనారాయణ మాట్లాడుతూ నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలను అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ప్రవేశపెట్టడంతో 104 వాహనాల ద్వారా గ్రామాలకు వెళ్లి రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారని చెప్పారు. పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ప్రజలకు అందిస్తున్న సేవలు మరువరానివని అన్నారు. అత్తిలి పీహెచ్‌సీలో పైకప్పు మరమ్మతులు చేపట్టాలని వైద్యులు ఎంపీపీ దృష్టికి తీసుకువచ్చారు. ఆసుపత్రిలో అందించే వైద్యసేవలపై ఎంపీపీ మక్కా సూర్యనారాయణ రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రికి సంబంధించి పలు రికార్డులను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంటా విజేత, వైద్యులు టి నాగరాజు, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావు, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలి



పాఠ్యాంశాలపై వివరాలను తెలుసుకుంటున్న తల్లిదండ్రులు

తాడేపల్లిగూడెం అర్బన్ : వేసవి సెలవులను సద్వినియోగం చేసుకుని పాఠ్యాంశాల అభ్యసనపై తమ పిల్లలకు అవగాహన కల్పించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సుబ్బారావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయని వనజ సూచనలు చేశారు. సుబ్బారావుపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు పలు సూచనలు చేశారు. ఫైనల్ పరీక్షలు పూర్తైన సందర్భంగా విద్యార్థులకు వేసవి సెలవులు ఆటవిడుపుతో ఉంటాయన్నారు. రోజులో ఒక గంట పాటు తమ పిల్లలతో తెలుగు, ఆంగ్ల భాషల పాఠ్యపుస్తకాలను చదివించి రాయించే విధంగా తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలన్నారు. పాఠశాలలలో ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలను విద్యార్థులు ఇంటి వద్ద చదవక పోవడంతో పరీక్షల సమయంలో పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్

తాడేపల్లిగూడెం (టీఓసీ): మే డే సందర్భంగా తలపెట్టిన కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.సోమసుందర్ విజ్ఞప్తి చేశారు. ఏఐటీయూసీ ఏరియా కమిటీ సమావేశం శనివారం సిపాయిపేట భవన నిర్మాణ కార్మిక సంఘం కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సోమసుందర్ మాట్లాడుతూ మే డే సందర్భంగా జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆవరణలో జరిగే కార్మిక కుటుంబాల ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏరియా కమిటీ కార్యదర్శి ఓసూరి వీర్రాజు, నాయకులు తాడికొండ శ్రీనివాసరావు, పాలూరి లక్ష్మణరావు, అంకం భాస్కరరావు, పడాల శ్రీనివాస్, పోలిరాతి ఆదినారాయణ, కాకర్ల రాంబాబు, కె.ముత్యం, కాటమరాజు, అల్లం నరేంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన వెంకన్న కల్యాణోత్సవాలు

కాళ్ల: మండలంలోని కాళ్లకూరు గ్రామంలో వేంచేసియున్న స్వయంభూ వెంకటేశ్వర స్వామివారి కల్యాణ మహోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం స్వామివారికి విష్వక్సేన పూజ, మృత్సంగ్రహణ, అంకురార్పణ, ధ్వజారోహణంతో స్వామివారి సప్తాహ్నిక తిరుకల్యాణ మహోత్సవాలు దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు దండు వెంకట కృష్ణంరాజు దంపతులచే ఘనంగా ప్రారంభమయ్యాయి.